## క్లుప్తంగా

### రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన



మాట్లాడుతున్న డీటీసీ శివారెడ్డి

నంద్యాల(న్యూటౌన్): స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సోమవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా జిల్లా రవాణా శాఖ అధికారి శివారెడ్డి ఆధ్వర్యంలో నంద్యాల జిల్లాలోని డ్రైవర్లకు రోడ్డు భద్రత నియమ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ద్విచక్రవాహన దారులు తప్పనిసరిగా హెల్మెట్, కారులో ప్రయాణించినప్పుడు సీటు బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలను నడపరాదని, సెల్‌ఫోన్ వాడకూడదని సూచించారు. మోటార్ వాహన తనిఖీ అధికారులు శ్రీకాంత్, రవిశంకర్‌నాయక్, బీటీనాయుడు, సుబ్బయ్య, కార్యాలయ ఏఓ కురుమూర్తి పాల్గొన్నారు.

### పథకాలపై అవగాహన



నగళ్లపాడులో డ్రోన్‌తో మందుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

చాగలమర్రి: గ్రామాల్లోని ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పిస్తున్నామని అధికారులు తెలిపారు. సోమవారం మండలంలోని నగళ్లపాడు గ్రామంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి వివరించారు. వ్యవసాయంలో డ్రోన్ వినియోగం తదితర అంశాలపై క్షేత్రస్థాయిలో ప్రయోగించి చూపించారు. ఈ నెల 26వ తేదీ వరకు సంకల్పయాత్రపై అవగాహన సదస్సు కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు. సర్పంచ్ ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి ఏసుదాసు, తహసీల్దార్ ఉద్యోగి పీరాశిరెడ్డి, ఎంపీహెచ్ఓ భాగ్యలక్ష్మీబాయి పాల్గొన్నారు.

### గ్రామాభివృద్ధికి పాటుపడాలి



పంచాయతీరాజ్ సీఈని సన్మానిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: సర్పంచులు గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని పంచాయతీరాజ్ చీఫ్ ఇంజినీర్ మేర్వ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం కామినేనిపల్లెలో సర్పంచు మేర్వ చిన్న నరసింహారెడ్డి సొంత నిధులతో జీర్ణోద్ధరణ చేసిన గ్రామ చావిడిని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన పీఆర్ సీఈకి మాట్లాడుతూ దాతల సహకారంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడం అభినందనీయమన్నారు. అనంతరం పీఆర్ సీఈ, గ్రామ పెద్దలను సర్పంచు సన్మానించారు.

### ఆళ్లగడ్డ ఎస్‌ఐగా నగీన



ఆళ్లగడ్డ: పట్టణ ఎస్‌ఐగా నగీన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతపురం జిల్లా మడకశిరకు చెందిన ఈమె 2018లో ఎస్‌ఐగా ఎంపికయ్యారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించారు. ప్రస్తుతం నంద్యాల మూడో పట్టణ ఎస్‌ఐగా పనిచేస్తున్నారు. బదిలీల్లో భాగంగా ఆళ్లగడ్డ పట్టణానికి కేటాయించారు. అనంతరం సిబ్బందితో సమావేశమై పట్టణ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

### సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

రుద్రవరం: మండలంలోని పేరూరు గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం సర్పంచు కోసిలి దేవదాసు, వైఎస్సార్‌సీపీ నాయకులు తిరుపతిరెడ్డి, క్రిష్ణారెడ్డి తదితరులు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఉపాధి, గ్రామ పంచాయతీ, గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పనులు చేపట్టినట్లు తెలిపారు.

### ఓంకారేశ్వరుడికి మహన్యాస పూర్వక రుద్రాభిషేకం



ప్రత్యేక అలంకరణలో ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామి

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని ఓంకార సిద్ధేశ్వర స్వామి వారికి సోమవారం విశేష పూజలు నిర్వహించారు. అయోధ్య బాలరాముడి ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా శ్రీ గంగా ఉమా సమేత ఓంకార సిద్ధేశ్వరస్వామికి వేదపండితులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పంచామృతాభి షేకం, సుగంధ ద్రవ్య అభిషేకం, ప్రత్యేక అలంకరణ కార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ విశ్వనాథరెడ్డి, ఈఓ నాగప్రసాద్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. భక్తులు కాకిరెడ్డినాయన ఆశ్రమంలో అన్న ప్రసాదం స్వీకరించారు.



అహోబిలంలో ప్రత్యేకాలంకరణలో ఉత్సవమూర్తులు,



భక్తులకు అన్నప్రసాదం పంపిణీ, గొట్టూరులో సీతారాములకు పూజలు చేస్తున్న భక్తులు,





డబ్బూ కొత్తపల్లెలో సీతారాములకు పంచామృతాభిషేకం చేస్తున్న మహిళలు,



నంద్యాలలో దర్శనానికి భక్తుల బారులు

# అంతా రామమయం

- అయోధ్యలో బాలరాముడి విగ్రహానికి ప్రాణప్రతిష్ట
- గ్రామ గ్రామాన ప్రత్యేక పూజలు, ఊరేగింపులు
- పల్లెల్లో పండుగ వాతావరణం
- ప్రత్యేకంగా తెరలు ఏర్పాటు చేసి కార్యక్రమాన్ని వీక్షించిన జనం
- అహోబిలంలో ఘనంగా సీతారాముల కల్యాణం



ఉయ్యాలవాడలో సీతారాములను ఊరేగిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: జయజయ శ్రీరామ నామ సంకీర్తనలు ప్రతిధ్వనిస్తుండగా.. ప్రత్యేక అలంకరణతో కోలిల్లుతున్న పెళ్లి మండపం.. వేద పండితుల వేదోక్త మంత్ర పఠనములు.. ఆస్థాన విద్వాంసుల మంగళ రమైన వాయిద్యాల నడుమ శ్రీ సీతారాముల పరిణయ వేడుక వైభవంగా జరిగింది. అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. పలు ఆలయాల్లో సీతారాముల కల్యాణం జరిపించారు. వేద పారాయణం, అభిషేకాలు, అర్చనలు చేపట్టి భక్తులకు అన్నదానం చేశారు. ఇందులో భాగంగా అహోబిల క్షేత్రంలో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి మూలమూర్తులను సుప్రభాత సేవతో మేలుకొలిపి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయ ప్రాంగణములో ఉన్న శ్రీరామాలయం సన్నిధిలో శ్రీ సీతారామ లక్ష్మణ స్వాముల ఉత్సవ మూర్తులను యాగశాలలో కొలువుంచి అర్చన, అభిషేకం, తిరుమంజనం అనంతరం పట్టు పీతాంబరాలతో అలంకరించి కల్యాణ మహోత్సవం శాస్త్రయుక్తంగా జరిపించారు. అనంతరం ముత్యాల తలంబ్రాల కార్యక్రమం నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

దొర్నిపాడు: అయోధ్యలో బాలరాముడి ప్రాణప్రతిష్ట సందర్భంగా మండలంలోని అన్ని రామాలయాల్లో ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. డబ్బూ కొత్తపల్లెలో భక్తుల కోసం ఎల్ఈడీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. నిండైన ముఖంతో చిరునవ్వులతో చిద్విలాసంగా ప్రశాంతంగా ఉన్న బాలరాముడిని చూసి భక్తులు తన్మయం చెందారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

రుద్రవరం: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా మండలంలోని పలు గ్రామాల రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆర్.నాగులవరం పంచాయతీ మజారా ఆర్.కొత్తపల్లెలో వెలసిన రామాలోరికి ఆళ్లగడ్డ మార్కెట్‌యార్డ్ కమిటీ చైర్మన్ గంధం రాఘవరెడ్డి, సర్పంచు గంధం సావిత్రమ్మ పట్టు వస్త్రాలు, పూలమాలలు అందజేశారు.

చాగలమర్రి: అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లోని రామాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక గాంధీ సెంటర్, పెద్దయ్య కొట్టాల వీధి, బసవన్న కట్ట వీధి, భూమా నగర్, చింతల చెరువు, పెద్దవంగలి, చింతలచెరువు, డి.కొత్తపల్లె, ముత్యాలపాడు, గొడిగనూరు, తోడేండ్లపల్లె, మల్లెవేముల గ్రామాల్లో శ్రీరామ, కోదండరామ స్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. గొట్టూరులో అన్నపురెడ్డి దస్తగిరిరెడ్డి కుటుంబ సభ్యులు సీతారాముల కల్యాణం జరిపించారు. అలాగే అయోధ్యలో జరుగుతున్న కార్యక్రమాలను వీక్షించేందుకు ఎల్ఈడీ టీవీ ఏర్పాటు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అన్నపురెడ్డి దస్తగిరిరెడ్డి, జయరామిరెడ్డి, జమాల్ రెడ్డి, జగదీశ్వరరెడ్డి, తులసీశ్వరరెడ్డి, భాస్కర్‌రెడ్డి, మహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మునగాలలో కరసేవకుడిని సన్మానిస్తున్న దృశ్యం

ఉయ్యాలవాడ : బాలరాముడి ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో సీతారాముల ఉత్సవ మూర్తులకు వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. సోమవారం స్థానిక కోదండ రామస్వామి ఆలయంలో తెల్లవారుజామున నుంచే ప్రత్యేక పూజలు, రాముని సంకీర్తనలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులను కొలువుంచి మేళ తాళాలతో గ్రామోత్సవం జరిపించారు. కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నంద్యాల(అర్బన్): మండలంలోని మునగాల గ్రామానికి చెందిన అయోధ్య రామమందిర కరసేవకుడు మిద్దె వెంకటేశ్వర్లును గ్రామస్తులు సోమవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ లోకేశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు రామచంద్రారెడ్డి, బీజేపీ నాయకుడు తూము శివారెడ్డి, గ్రామస్తుల ఆధ్వర్యంలో సత్కరించారు.

నంద్యాల(వ్యవసాయం): అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠను పురస్కరించుకొని పట్టణంలో పండుగ వాతావరణం నెలకొంది. పట్టణంలోని వివిధ ఆలయాల్లో అభిషేకాలు, కల్యాణం, భజనలు, సామూహిక కుంకుమార్చనలు, కోలాటాలు నిర్వహించారు. పలు ఆలయాల్లో పెద్దపెద్ద స్క్రీన్‌లను ఏర్పాటు చేసి అయోధ్యలో జరిగే ప్రతిష్ఠ వేడుకలను తిలకించి తన్మయం చెందారు.

- స్థానిక సంజీవనగర్ రామాలయంలో సీతారామ లక్ష్మణ, హనుమంతుల వార్లకు భగవత్ సేవా సమాజ్ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించి సీతారామ లక్ష్మణ విగ్రహాలను ముత్యాల అలంకారంలో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. 108 పర్యాయాలు, హనుమాన్ చాలీసా పారాయణాన్ని నిర్వహించారు. అనంతరం దీపోత్సవం, ఊంజల్ సేవా కార్యక్రమాలు జరిపించారు. డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు అయోధ్య రాముడి విశిష్టతను భక్తులకు వివరించారు.
- కాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చిన్నా దులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానిక కల్పనా సెంటర్ రామాలయం వద్ద రామాలయ కమిటీ ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు.
- బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదులకు ప్రసాదాలు అందజేశారు.
- మెయిన్ బజార్‌లో వెలసిన అమ్మవారిశాలలో శ్రీవాసవి దీక్షా మండలి ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణులకు ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక కుంకుమార్చనలు చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. పెద్ద స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు.
- బాలాజీ కల్యాణ మండపంలో సీతారామ చంద్రమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. పెద్దస్క్రీన్‌ను ఏర్పాటు చేసి ప్రత్యక్ష ప్రసారం తిలకించే ఏర్పాటు చేశారు. ఎస్‌బీఐ కాలనీలోని కోదండ రామాలయంలో రామజన్మభూమి క్షేత్ర ట్రస్టు ఆధ్వర్యంలో సీతారాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు ఏర్పాటు చేశారు. సాయంత్రం ఇస్కాన్ ఆధ్వర్యంలో సంకీర్తనలతో గ్రామోత్సవం జరిపించారు. ఆయుష్ యోగా సేవా సమితి ఆధ్వర్యంలో యోగా గురువు ఆనంద్‌గురూజీ ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ చిత్రపటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో భక్తులకు పానం, వడపప్పు పంపిణీ చేశారు. టెక్కె నాగుల కట్ట దేవాలయంలో భక్తుల ఆధ్వర్యంలో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆర్ఎస్ రోడ్డులోని కోదండ రామాలయం భరతమాత గుడి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టణంలో శోభాయాత్ర చేపట్టారు.
- సాదిక్‌నగర్‌లో వెలసిన రామాలయంలో కౌన్సిలర్ కృష్ణమోహన్ దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ఎమ్మెల్యే శిల్పారవి పాల్గొన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిం, హిందువులు కలిసి పూజలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శిల్పా రవి











క్రిష్ణాపురంలో సీతారాముల గ్రామోత్సవం, చాగలమర్రిలో అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, నంద్యాల నాగలింగేశ్వరస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం, బార్ అసోసియేషన్, బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ, వీహెచ్‌పీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

## రజక సంఘాభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): రజక సంఘాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. నియోజకవర్గంలోని రజక సంఘీయుల సమస్యలను పరిష్కరిస్తానని చెప్పారు. స్థానిక నిశాంత్ భవన్‌లో సోమవారం అఖిల భారత నంద్యాల జిల్లా రజక సంఘం ఆధ్వర్యంలో సంఘీయుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ దోబీఘాట్లు లేని గ్రామాలను గుర్తించి దోబీఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దిలేటితో కలిసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి రాము, కన్వీనర్ నాగరాజు, మద్దు, పెద్దయ్య, నాగేశులు, తిమ్మయ్య పాల్గొన్నారు.

## పకడ్బందీగా కులగణన



నంద్యాలలోని దేవనగర్-1 పరిధిలో వివరాలు సేకరిస్తున్న 26వ వార్డు సచివాలయ సిబ్బంది

నంద్యాల(సిటీ): పట్టణంలో కులగణన సర్వే పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి తెలిపారు. సోమవారం పలు వార్డుల్లో సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సహకారంతో సర్వే నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల వివరాలను నమోదు చేస్తున్నారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు అధికారులు, సిబ్బందికి సహకరించాలని కోరారు. ఇది కేవలం సంఖ్యా గణన మాత్రమేనని, దీని వల్ల ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు ఎలాంటి సంబంధం ఉండదని చెప్పారు.

## జిల్లా ఏఈఓల సంఘం కార్యదర్శి ఎన్నిక

నంద్యాల(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా కార్యదర్శిగా నంద్యాల మండల ఏఈఓ మనోహర్ ఎన్నికయ్యారు. కర్నూలు పట్టణంలో ఆదివారం సాయంత్రం జరిగిన సంఘం ఎన్నికల్లో 84 మంది ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకోగా మనోహర్‌కు 45ఓట్లు, శ్రీరామ్ ప్రదీప్‌కు 35 ఓట్లు వచ్చాయి. మనోహర్‌ను నంద్యాల డివిజన్ ఏఈఓలు సోమవారం అభినందించారు.

**సమస్యలు పరిష్కరించాలి**

నంద్యాల(న్యూటౌన్): అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నంద్యాలలో సీపీఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. సీపీఎం కార్యదర్శి రమేష్‌కుమార్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోటమద్దులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు నాగరాణి మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని విలేకరులు... అన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలను అరెస్ట్ చేయడం తగదన్నారు. గౌస్, వెంకటలింగం పాల్గొన్నారు.

## నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

దొర్నిపాడు: మండలంలోని గుండుపాపల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 వైద్య శిబిరం ఏర్పాటు చేస్తామని ఎంపీడీఓ సుబ్బారెడ్డి సోమవారం తెలిపారు. స్థానిక సచివాలయ ఆవరణలో శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నామని, వైద్యనిపుణులు వైద్య సేవలందిస్తారని, స్థానికులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఇంటర్న్‌షిప్‌పై అవగాహన సదస్సు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని ఎస్పీవై డిగ్రీ కళాశాలలో లాంగ్‌టర్మ్ ఇంటర్న్‌షిప్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ మునీశేఖర్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఇందులో భాగంగా ఎస్‌ఆర్‌ఎస్ అయిన జినిల్జా, ఎస్‌ఎల్‌సీసీ సొల్యూషన్, జస్ట్‌స్‌స్, నెక్ట్ సొల్యూషన్ కంపెనీలతో ఇంటర్న్‌షిప్ తో పాటు స్టయిఫండ్, ఉద్యోగ అవకాశం కల్పిస్తారన్నారు. గతంలో మాదిరిగానే కళాశాలలో ఈ ఏడాది 5వ సెమిస్టర్ పరీక్షలు పూర్తయిన విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని ఆయా కంపెనీలతో ఉద్యోగ కల్పనే ధ్యేయంగా శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. అవకాశాన్ని నిరుద్యోగులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సదస్సులో అన్వర్, సాయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పశు వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

గోస్పాడు: పశువులకు వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని కిశోర్ కుమార్ రెడ్డి సూచించారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామంలో సోమవారం వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ డాక్టర్ సరోజినీ దేవి, విద్యార్థుల ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. వారు మాట్లాడుతూ మహానంది వ్యవసాయ కళాశాల నాలుగవ సంవత్సరం విద్యార్థులు జాతీయ సేవ పథకం ప్రత్యేక శిబిరంలో భాగంగా గ్రామంలోని గేదెలకు వైద్య శిబిరం నిర్వహించారు.



ఉయ్యాలవాడ సమీపంలో యంత్రంతో శనగ పంటను నూర్పిడి చేస్తున్న దృశ్యం

## శనగ కోతలు ప్రారంభం

ఉయ్యాలవాడ : రబీలో భాగంగా సాగు చేసిన పప్పు శనగ పంట కోతలు ప్రారంభమయ్యాయి. మండలంలో ఈ సీజన్‌లో 28 వేల ఎకరాల్లో శనగ పంట సాగైంది. గత ఏడాది అక్టోబర్‌లో పంట సాగు చేశారు. విత్తనం వేసిన 50 రోజులకు దాదాపు అదును వర్షం కురవలేదు. వర్షాభావ పరిస్థితుల వల్ల పంటకు ఆవసరమైనా తేమశాతం భూమిలో లేక మొక్క ఎదుగుదల నిలిచిపోయింది. అయినా రైతులు వివిధ రకాల మందులు పిచికారి చేసినప్పటికీ పంటకు పేరికి వచ్చే సమయానికి ఎండుబారిపోయింది. ప్రస్తుతం ఉయ్యాలవాడ, ఆర్.పాంపల్లె, హరివరం, కొండుపల్లె గ్రామాల్లో కోతలు జరుగుతున్నాయి. ఆధునిక నూర్పిడి యంత్రాలు అందుబాటులోకి రావడంతో ఎకరా పంటను కేవలం 30 నిమిషాల్లో నూర్పిడి చేస్తున్నాయి. యంత్రంతో కోత కోస్తే రూ.1200 నుంచి రూ.1500 వరకు చెల్లిస్తున్నారు. గతంలో కూలీలు ఒక ఎకరా పంట కోత కోస్తే రైతు రూ.2వేల వరకు చెల్లించేవారు. ఎకరాకు రెండు నుంచి మూడు క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయని రైతులు పేర్కొంటున్నారు.

## తామర వికాసం..

దొర్నిపాడు: నీటి వనరులకు తామర పుష్పాలు కొత్త అందాలను తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా గ్రామాల్లోని కుంటలు, చెరువుల్లో గతంలో విస్తారంగా కనిపించేవి. ప్రస్తుతం అరుదుగా మారాయి. మండలంలోని గుండుపాపల, ఉమాపతినగరం గ్రామాల్లోని కుంటల్లో తామర పూలు స్థానికులను ఆకర్షిస్తున్నాయి. వెడల్పాటి ఆకులు, ముద్దులొలికే గులాబీ, తెలుపు వర్ణాలు కలిగిన పూలు ఆకట్టుకుంటున్నాయి.



ఉమాపతి నగరంలోని కుంటలో విరబూసిన తామర పుష్పాలు

## స్వచ్ఛ ఓటర్ల జాబితా సిద్ధం

- తుది జాబితా విడుదల
- కొత్తగా 5,173 ఓట్లు
- నియోజకవర్గంలో 230914 మంది ఓటర్లు

ఆళ్లగడ్డ: నియోజకవర్గంలో స్వచ్ఛ ఓటర్ల జాబితా విడుదలైంది. రాబోయే సాధారణ ఎన్నికల్లో అర్హత కలిగిన ఓటర్లు అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలనే ఉద్దేశంతో క్షేత్ర స్థాయి వరకు ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని కొద్ది మాసాలుగా పగడ్బందీగా నిర్వహించారు. స్వచ్ఛమైన ఓటర్ల జాబితా తయారీ కోసం భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు కొత్తగా ఓటరు నమోదు చేసుకోవడం, మార్పులు, చేర్పులు, తొలగింపులు, అభ్యంతరాలకు చేసుకున్న దరఖాస్తులను సిబ్బంది పరిశీలించి వీటన్నింటికీ పారదర్శకమైన పరిష్కారం చూపి తుది జాబితా విడుదల చేశారు. గతంలో 2,25,741 ఓటర్లు ఉండగా, ప్రస్తుతం 5,173 ఓట్లు పెరిగి ప్రస్తుతం 2,30,914 ఓటర్లతో కూడిన జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది.

**మండలాల వారీగా ఓటర్ల జాబితా వివరాలు..**

| మండలం | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్ జెండర్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| దొర్నిపాడు | 26 | 10,003 | 10,053 | 0 | 20,056 |
| ఉయ్యాలవాడ | 30 | 11,207 | 11,469 | 2 | 22,678 |
| శిరివెళ్ల | 62 | 23,345 | 23,590 | 4 | 46,939 |
| ఆళ్లగడ్డ | 74 | 30,751 | 32,183 | 5 | 62,939 |
| రుద్రవరం | 51 | 18,822 | 18,862 | 1 | 37,685 |
| చాగలమర్రి | 52 | 20,183 | 20,432 | 2 | 40,617 |
| మొత్తం | 295 | 1,14,311 | 1,16,589 | 14 | 2,30,914 |



ఉమామహేశ్వర స్వామి, అమ్మవారి ఉత్సవమూర్తులకు పల్లకోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

## యాగంటీశ్వరుడికి పల్లకీ సేవ

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి పల్లకీసేవ కార్యక్రమం సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి, చైర్మన్ తోట బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకం అర్చన తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో కొలువైన శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ముస్తాబు చేసి, ఆలయ చుట్టూ పల్లకీసేవ కార్యక్రమాన్ని నిర్వహించారు.